



140 .250 మీటర్లా?

- అమరావతి ఓఆర్ఆర్ వెడల్పుపై స్పష్టత కరువు
- గతంలో 140 మీటర్లకే కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 250 మీటర్ల భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- గగ్గోలు పెడుతున్న రోడ్డు ఎలైన్‌మెంట్ బాధిత రైతులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) వెడల్పుపై స్పష్టత కొరవడింది. కొన్ని నెలల క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 140 మీటర్ల వెడల్పునకు తుది డీపీఆర్‌ని ఆమోదించింది. అయితే ఇప్పుడు ఆ వెడల్పు కూడా చాలదన్నట్లు బఫర్ జోన్ పేరుతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) 250 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవకు నివేదించింది. జేసీ ఆమోదం తెలిపితే సర్వే నంబర్లతో భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు రెవెన్యూ యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే ఓఆర్ఆర్ కోసం పావు కిలోమీటర్ వెడల్పు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల ఎకరాలకు ఎకరాలు భూములు కోల్పోతామని గగ్గోలు పెడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 140 మీటర్లకే లోబడి భూసేకరణ చేసుకోవాలని కోరుతున్నారు. రాజధానికి మణిహారంగా ఉండేలా చేసేందుకు అవుటర్ రింగు రోడ్డుని ఏపీసీఆర్‌డీఏ ప్రతిపాదించింది. దాదాపుగా 190 కిలో మీటర్ల పొడవునా గుంటూరు, పల్నాడు, ఉమ్మడి కృష్ణ జిల్లాల మీదగా దీని ఎలైన్‌మెంట్‌ని రూపొందించారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.24,791 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ ఎగువున, దిగువున రెండు పొడవాటి బ్రిడ్జిలు, రిజర్వు ఫారెస్టులో టన్నెల్స్, రెండు స్పేర్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 ప్యాకేజీలుగా ఓఆర్ఆర్ పనులను విభజించి టెండర్లు పిలిచేందుకు నిర్ణయించారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతోనే రింగురోడ్డుని నిర్మించాలని భావించారు. అయితే భవిష్యత్‌లో రైలుమార్గం, ఇతరత్రా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో (మిగతా 6వ పేజీలో)

నేడే.. సుఖీభవ

అన్నదాతలకు ఆర్థిక సాయం

- 1,60,441 మందికి రూ.107.21 కోట్లు
- అర్హుల బ్యాంకు ఖాతాలకు రెండో విడత జమ




(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు శుభవార్త. పీఎం-కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం-కిసాన్ పథకం కింద రూ.2,000 కలిపి మొత్తం రూ.7,000 అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల, నియోజకవర్గ స్థాయితో పాటు జిల్లా స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. సుఖీభవ సొమ్ము పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు సుఖీభవ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు వివరించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.7 వేల సాయం రబీలో పంటల సాగుకు ఉపయోగపడనున్నాయి. సుఖీభవ పథకం రెండో విడత డబ్బు తమ బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ (మిగతా 6వ పేజీలో)

లబ్ధిదారుల మధ్య వ్యత్యాసం

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో మొత్తం 1,60,441 మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. వీరి ఖాతాల్లో రూ.80.22 కోట్లు జమ కానున్నది. పీఎం కిసాన్ పథకం కింద 1,34,925 మందిని అర్హులుగా గుర్తించిన కేంద్రం వీరి ఖాతాల్లో రూ.26.99 కోట్లు వేయనున్నది. ఈ గణాంకాలను పరిశీలిస్తే రెండింటికీ మధ్య 25,516 మంది లబ్ధిదారుల వ్యత్యాసం కనిపిస్తోంది. దాదాపుగా ఇవే అంకెలు తొలి విడత డబ్బులు జమ సమయంలో కూడా యంత్రాంగం ప్రకటించింది. ఆ సమయంలో సాంకేతిక చిక్కుల వల్ల ఈ తేడా వచ్చిందని, రెండో విడత సమయానికి ఈ చిక్కులు పరిష్కార మవుతాయని వ్యవసాయశాఖ తెలిపింది. కానీ అవి పరిష్కారం కాకపోవడంతో జిల్లాలో పలువురు రైతులకు రెండో విడతలోనూ నిరాశే ఎదురవనున్నది. కాగా జిల్లా స్థాయిలో కార్యక్రమం బాపట్లలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులు నిమగ్నమయ్యారు.



ఇదేం ప్రశ్నపత్రం

- చేతిరాతపై విద్యార్థుల అవాక్కు
- పునరావృతం కాదన్న పీజీ కోఆర్డినేటర్

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. అదేదో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు సంబంధించినవి కాదు. అలాంటి పరీక్షలకు సంబంధించి కూడా అధికారులు అప్రమత్తంగా ఉంటారు. అలాంటిది పీజీ కోర్సులకు సంబంధించి, అదీ విద్యార్థులకు కీలకమైన సెమిస్టర్ పరీక్షలంటే ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ఘనత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్య ధోరణి వీడటంలేదు. వర్సిటీ పరీక్షల విభాగం నిర్లక్ష్యం ఎంత అధ్వానంగా మారిందంటే సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా చేతిరాతతో ఇచ్చారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు చేతిరాతతో ఇచ్చిన ప్రశ్నపత్రం చూసి అవాక్కయ్యారు. వర్సిటీలో మంగళవారం పీజీ ఆర్ట్స్ సైన్స్, ఎంబీఏ, ఎంసీఏలతో పాటు ఎల్.ఎల్.బీ కోర్సులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే సైన్స్ విభాగం ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ప్రశ్నపత్రం చేతితో రాసినది చూసి విద్యార్థులు విస్తుపోయారు. చివరకు విద్యార్థులకు నచ్చచెప్పిన అధ్యాపకులు వారితో పరీక్ష రాయించారు. ఆ ప్రశ్నపత్రాన్ని చూసి అధ్యాపకులు కూడా కంగుతున్నారు. ఈ ప్రశ్నపత్రంపై ఆరా తీయగా గతంలో ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన అధ్యాపకుడే కారణమని తెలిసింది. దీనితో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. దీనిపై పీజీ కోఆర్డినేటర్ సుబ్బారావును వివరణ కోరగా సమయం తక్కువ ఉండటంతో రాత పూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.



మావోల షెల్టర్‌పై.. ఉలికిపాటు

- కలకలం రేపిన విజయవాడ ఘటన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులపై పోలీసుల ఆరా
- నాడు మావోలకు పెట్టనికోటగా పల్నాడు, నల్లమల ప్రాంతం

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని తోపాటు రాష్ట్రంలోనే అత్యంత కీలక ప్రాంతం విజయవాడలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్న ఉదంతం పోలీస్ శాఖతో ప్రజలను కూడా ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడలో ఏకంగా 27 మంది మావోయిస్టులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. గతంలో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలోనూ విజయవాడ లాంటి నగరంలో ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఛత్తీస్‌ఘడ్, ఏవోబీ ప్రాంతాల్లో కేంద్ర పోలీస్ బలగాల ముప్పేట దాడులతో ఇప్పటికే మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వందలాది మంది ఎన్‌కౌంటర్లలో హతమవగా, అదే స్థాయిలో లొంగుబాటు పర్వం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా మావోయిస్టుల అత్యంత కీలక నేత హిడ్మా సహా ఆరుగురు ఎన్‌కౌంటర్లో మృతి చెందడం.. అదే సమయంలో విజయవాడలో 27 మంది పోలీసులకు పట్టుబడటం కలకలం రేపింది. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది.

గతంలో నల్లమల కీలకమైన ప్రాంతం

ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా... షెల్టర్ జోన్‌గా ఉన్న నల్లమల ప్రాంతంలో దాదాపు ఒకటిన్నర దశాబ్దంగా వారి ఉనికే లేకుండా పోయింది. గతంలో నల్లమల కేంద్రంగా మావోయిస్టులు కార్యకలాపాలు సాగించారు. నల్లమలను ఆనరాగ పల్నాడు ప్రాంతంలో పూర్తిస్థాయిలో విస్తరించి పోలీస్ శాఖకు సవాల్‌గా నిలిచారు. దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే పల్నాడు ప్రాంతవాసి కావడంతో ఈ ప్రాంతంపై మావోయిస్టులు తమదైన శైలిలో ముద్రవేశారు. అటు తెలంగాణ సరిహద్దు జిల్లాలతో పాటు ఇటు ఏపీలోని సరిహద్దు జిల్లాల మధ్య విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతం గతంలో మావోయిస్టులకు షెల్టర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ నుంచే మావోయిస్టులు పెద్దఎత్తున కార్యకలాపాలు సాగించారు. 2004లో ప్రభుత్వంతో మావోయిస్టు చర్చలు విఫలం తర్వాత మావోయిస్టుల అనుపానులు తెలుసుకుని నల్లమలలో వారి షెల్టర్‌కు గండి కొట్టారు. దీంతో వారంతా ఈ ప్రాంతాన్ని వదిలి ఏవోబీ వైపు వెళ్లారు. 2010 నుంచే పల్నాడు ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కనుమరుగవుతూ వచ్చాయి. అదే సమయంలో తెలంగాణలో కూడా పూర్తిగా మావోయిస్టు కార్యకలాపాలను అణిచి వేయడంతో ఏపీ, తెలంగాణలో మావోయిస్టులకు షెల్టర్ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తాజాగా విజయవాడలో 27 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులు చర్చనీయాంశమయ్యాయి. అయితే విజయవాడలో మావోయిస్టులు పట్టుబడిన సందర్భాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్, ఏఓబీ ప్రాంతంలో పోలీస్ దాడులు పెరగడంతో ప్రాణ రక్షణ కోసం మావోయిస్టులు మైదాన ప్రాంతం వైపు వచ్చి ఉంటారని... పరిస్థితులు అనుకూలిస్తే లొంగిపోవాలని భావించి ఉంటారని పోలీసు వర్గాలు అంటున్నాయి. నల్లమల ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని.. అలాగే పల్నాడు ప్రాంతంలో వారికి షెల్టర్ అవకాశమే లేదని నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రహస్యంగా ఈ ప్రాంతానికి వచ్చినా ప్రజలే పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించే పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో మానసిక ఆరోగ్యం మెరుగుపడాలంటే తప్పనిసరిగా క్రీడలు నిర్వహిస్తుండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మానసిక ఆరోగ్యంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వీ వినోద్‌కుమార్

మాట్లాడుతూ విద్యార్థుల్లో సమానత్వం, ఐక్యతపై అవగాహన కల్పించాలని చెప్పారు. భవిష్యత్ సమాజ నిర్మాణం తరగతి గదుల్లోనే ప్రారంభమౌతుందనే విషయాలను అధికారులు గుర్తించాలన్నారు. 100 మంది విద్యార్థులు దాటితే తప్పనిసరిగా ఆ విద్యా సంస్థలో ఒక సైకియాట్రిస్టు ఉండాలన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యే, ఆత్మహత్య ఆలోచన వచ్చే విద్యార్థుల కోసం టోల్‌ఫ్రీనెంబరు 14416 టెలీమానస్ సేవలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చన్నారు. డిసెంబరులో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి :కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

- అన్నదాత సుఖీభవ, పీఎమ్ కిసాన్ ఆర్థికసాయం రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- వాల్టా చట్టం ఆధారంగా ఇసుకరేవులు అనుమతించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జువ్వలపాలెంలో 14.960, చిలుమూరులో 4.9, గాజుర్లంక-బీ ప్రాంతంలో 4.9 హెక్టార్ల ఇసుక లభ్యత ఉందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తదుపరి ఆప్రాంతం నుంచి ఇసుక తవ్వడానికి అనుమతి ఉంటుందన్నారు. ఓలేరు రేవులో ఇసుక తవ్వకాలకి ముందస్తు పరిశీలన చేయాల్సి ఉందన్నారు. కొల్లూరు మండలంలోని చిలుమూరు, గాజుర్లంక వద్ద మూడురేవులను గుర్తించామని చెప్పారు. వాల్టా చట్టం ఆధారంగా పర్యావరణ అనుమతులను పరిశీలించాలన్నారు. రేవులు ఉన్న ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఉంచాలన్నారు. ఆయా సమావేశాల్లో జేసీ భావన వశిష్ఠ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ జుబేర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ డీఎమ్ కరుణశ్రీ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామ్‌సన్, సేంద్రియ వ్యవసాయ డీపీఎమ్ హుస్సేన్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా గనులు, భూగర్భశాఖాధికారి బి.రామచంద్ర, భూగర్భజలశాఖ ఏడీ సురేష్, డీటీవో పరందామరెడ్డి, డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.



తీరంలో పర్యాటకుల సందడి (పాతచిత్రం)

ఆంక్షలు.. తొలగింపు

- నేటి నుంచి పర్యాటకులకు అనుమతి
- మొంథా తుఫాన్‌తో బీచ్‌ల మూత
- వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

వాడరేవు(చీరాల), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో 20 రోజులుగా వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం పరిధిలోని తీరంలో విధించిన ఆంక్షలను బుధవారం నుంచి సడలించారు. దీంతో గతంలో మాదిరిగా ఆయా బీచ్‌లు పర్యాటకులతో కళకళలాడనున్నాయి. ఆంక్షలతో మూతపడిన రిసార్ట్స్ యథావిధిగా తెరుచుకోనున్నాయి. కార్తీక మాసంలో పుణ్యస్నానాలపై ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో అధికారులు తీరంలో పర్యటించి పరిస్థితులు అనుకూలంగా మారడంతో బుధవారం నుంచి కొన్ని నిబంధనలను అనుసరిస్తూ ఆంక్షలు ఎత్తివేశారు. ఆంక్షలు తొలగింపుతో మత్స్యకారులు వేటకు సిద్ధమయ్యారు. దాదాపుగా 20 రోజుల పాటు తుఫాన్ ప్రభావంతో బోట్లు ఒడ్డుకు చేరాయి. వేట లేక పూట గడవక నానా యాతన పడ్డారు. అనుమతి లభించడంతో మత్స్యకార గ్రామాల్లో సందడి నెలకొంది.

నిబంధనలు అనుసరించే అనుమతి

తీరంలో పరిస్థితులు పూర్తిగా చక్కబడలేదని, నిబంధనలు అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మూడు చోట్ల వంతెనలు కూలాయని, జాతీయ రహదారి 167ఏ జీరో పాయింట్ వద్ద చప్టా ఇబ్బందిగా ఉందన్నారు. పర్యాటకులు ఆయా ప్రతికూలతలు గమనించి నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు ఆచరించాలన్నారు.

శింగరకొండ.. దేదీప్యం

- భారీగా మహిళలు వైభవంగా కోటి దీపోత్సవం
- అరుణాచలంలో వలే నిర్వహించాలన్న కృష్ణస్వామి



అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో కోటి దీపోత్స వం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న కృష్ణస్వామి

ప్రసన్నాం జనేయస్వామి దేవాలయం దక్షిణ రాజ గోపురం ముందు దీపోత్సవం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసన్నాం జనేయస్వామికి రుద్రాక్షలతో అలంకరించారు. కోటి దీపోత్సవాన్ని లక్ష్మ వరం కాశీవిశ్వేశ్వరాలయం కృష్ణస్వామి ప్రారంభించి ప్రసంగించారు. ఎంతో విశిష్టత ఉన్న శింగరకొండలో కూడా అరుణాచలం నిర్వహించినట్లుగా దీపోత్సవం నిర్వహించాలన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసు ధాకరరావు, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, పూజారులు పాల్గొన్నారు. సీఐ సుబ్బరాజు ఆధ్వ ర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది.

సకాలంలో పాఠశాలకు చేరుకోవాలి

- ఉచితంగా సైకిళ్ల పంపిణీ ఉద్దేశమిదే
- విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి సూచన

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పాఠశాలకు చేరేందుకే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటలీకి చెందిన ఐఎస్‌పీ, నెడ్‌క్యాప్ సంస్థల సహకారంతో ముప్పవరం విద్యార్థులకు సైకిళ్లు అందించినట్లు తెలిపారు. రవాణా సౌకర్యం లేక విద్యకు విద్యార్థులు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఉచితంగా సైకిళ్లను సమకూర్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 10వేల మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 5,100 మందికి అందచేశామన్నారు. సైకిళ్లపై పాఠశాలకు చేరుకునే విద్యార్థులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.



ముప్పవరంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

అండర్‌పాస్ ఏర్పాటుకు వినతి

విజయవాడ, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పాఠశాలకు సమీపంలో జరుగుతున్నందున విద్యార్థులు ఇబ్బంది పడకుండా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్లు విష్ణుప్రియ, జయకృష్ణహరీష్, రామారావు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, సుమంత్, ఎంఈవో వీరాంజనేయులు, హెచ్ఎం ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ.సుబ్బారావు, ధూళిపాళ్ళ రామచంద్రప్రసాద్, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, డీసీ ఛైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, గరిమిడి జగన్, గుర్రం ఆదిశేఖర్, చింతల సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల శింగరకొండ, బత్తుల వెంకటరావు, గొల్లపూడి అంజయ్య, జాగర్ల మూడి శ్రీను, సింగర్, వలపర్ల సుబ్బారావు, రవి, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బంగారురాజు, ధూళిపాళ్ల స్వామి, శ్రీను, కోమటిప్రసాద్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రబాబుకు పీహెచ్‌డీ ప్రదానం



ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన యంత్రపాటి రవీంద్రబాబుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. డాక్టర్ ఓ.నాగరాజు పర్యవేక్షణలో అడాప్టివ్ రీసోర్స్ మేనేజ్మెంట్, వర్క్ ఫ్లో ఆప్టిమైజేషన్ ఇన్ బిగ్ డేటా సిస్టమ్స్, యూజింగ్ ఇంటిగ్రేటెడ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై రవీంద్రబాబు పరిశోధనా గ్రంథాన్ని సమర్పించి పీహెచ్‌డీని పొందారు. పీహెచ్‌డీ పట్టాను పొందిన రవీంద్రబాబును అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఏఎన్‌యూ పరిధిలో పరీక్షలు ప్రారంభం



పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి ఎంఈడీ, బీఈడీ మూడో సెమిస్టర్, పీజీ సైన్స్, ఆర్ట్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు నాగార్జున యూనివర్సిటీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 5,800 మంది విద్యార్థులు, ఎం ఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలకు 150మంది, లా పరీక్షకు 700 మంది, స్పెషల్ బీఈడీ పరీక్షకు 30 మంది, పీజీఆర్ట్సఅండ్ సైన్స్ పరీక్షకు 3,675 విద్యార్థులు హాజరయ్యారు.

వెంకటపాలెం టీటీడీ దేవస్థానానికి నిధులు

● రూ. 90 కోట్లు కేటాయించిన టీటీడీ పాలక మండలి ● ఈ నెల 27న సీఎం పనులను ప్రారంభించే అవకాశం


గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర వైభవాన్ని అమరావతిలోనే దర్శింపజేసేలా రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఆలయం చుట్టూ భారీ ప్రాకారం, ప్రధాన ముఖద్వారం వద్ద ఏడు అంతస్తులతో మహారాజ గోపురం, మూడు దిక్కుల్లో ఐదు అంతస్తులతో రాజ గోపురాలు, మాడ వీధులు, కల్యాణోత్సవ, కల్యాణ మండపాల నిర్మాణ పనులను ప్రారంభించ బోతోంది. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 90 కోట్లు నిధులు కేటాయించడంతో మరో వారం పది రోజుల్లో నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే నిర్మాణాల పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

● రూ. 185 కోట్లతో ప్రణాళిక

శ్రీవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 185 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేసింది. వాటిని ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీటీడీ అధికారులు వివరించారు. ఆయన ఆమోదముద్ర వేయడంతో అమలుకు పూనుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం రూ.90 కోట్ల నిధులను టీటీడీ విడుదల చేసింది. ఆ నిధులతో ఈ నెల 27న పనులు ప్రారంభించనున్నారు.

● జగన్ కక్షతో నాడు ఆగిన నిర్మాణం

రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని ఏడున్నరేళ్లకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. వెంకటపాలెం వద్ద సీడ్ యాక్సిస్ రోడ్డు, కృష్ణా కరకట్టకు మధ్యలో 25 ఎకరాలను అందుకోసం కేటాయించింది. రూ. 136 కోట్ల అంచనా వ్యయంతో తిరుమలను తలపించేలా శ్రీవారి ఆలయం నిర్మించాలని భావించింది. ఈ ప్రతిపాదనకు తితిదే ధర్మకర్తల మండలి 2018లో ఆమోదం తెలిపింది. ప్రణాళికలు సిద్ధమై పనులు ప్రారంభించిన



నిర్మించనున్న దేవస్థానం వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నమూనా ప్లాన్

కొన్నాళ్లకే వైసీపీ అధికారంలోకి వచ్చింది. రాజధానిపై కక్షగట్టి ఎక్కడి పనులు అక్కడే నిలిపేసింది. ఆలయ నిర్మాణానికి కేటాయించిన అంచనాలను రూ. 136 కోట్ల నుంచి 36 కోట్లకు కుదించి, రూ.100 కోట్లను విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో శ్రీవారి ఆలయ నిర్మాణ పనులూ నిలిచిపోయాయి. ప్రధాన ఆలయం, లోపలి ప్రాకారం, ఒక రాజగోపురం, ధ్వజస్తంభ మండపాలు మాత్రం నిర్మించి మమ అనిపించారు.

● అన్ని హంగులతో దేవస్థాన నిర్మాణం


ఏడున్నరేళ్ల క్రితం శ్రీవారి ఆలయాన్ని ఏ స్థాయిలో నిర్మించాలనుకున్నారో దానికి మించి సకల హంగులతో దేవస్థానాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఇప్పుడు వెలుపలి ప్రాకారాన్నీ నిర్మించనున్నారు. వెలుపలి ప్రాకారానికి తూర్పు దిక్కున ప్రధాన ముఖద్వారం వద్ద 7 అంతస్తులతో మహారాజ గోపురం, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశల్లో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మిస్తారు. వాటితో పాటు కల్యాణోత్సవ, ఉత్సవ మండపాలను నిర్మించనున్నారు. ప్రస్తుతం తొలి దశ పనుల్లో భాగంగా వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నిర్మాణాలను చేపట్టనున్నారు.

వీరులను స్మరించుకుంటూ...

● నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23వ తేదీన కల్లిపాడుతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే పలు జిల్లాల నుంచి వీరాచారవంతులు కారంపూడికి చేరుకున్నారు. తమ పూర్వీకుల ఆయుధాలకు గంగధారమడుగులో స్నానమాచరింపజేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్, కూటమి నేతలు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పదవీ వ్యామోహం.. దాయాదుల వైరం.. శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో కారంపూడి వేదికగా జరిగిన పల్నాటి యుద్ధానికి ఓ చరిత్ర ఉంది. గతంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎందరో రాజులు గతించారు. ఎన్నో రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాని కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధం మాత్రం నేటికీ ప్రజల హృదయాంతరాలలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ద్వాపర కాలంనాటి మహాభారతాన్ని తలపిస్తూ సాగిన మారణకాండలో ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండె చప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను ఆలపిస్తాయి. సుమారు 900 సంవత్సరాలకు పూర్వం నాయకురాలు నాగమ్మకు, బ్రహ్మానాయుడు వర్గాలకు మధ్య జరిగిన భీకర పోరాటం గుర్తులు నేటికీ చెరి



వీర్ల దేవాలయం

గిపోలేదు. నాటి రాజులు వాడిన ఆయుధాలు, వారి గుర్తుగా శిలలు కారంపూడిలోని వీర్లదేవాలయంలో పల్నాటి చరిత్రకు సజీవసాక్ష్యాలుగా నిలిచాయి. ప్రపంచంలోని రోమ్ నగరం తరువాత మన దేశంలోని కారంపూడిలో మాత్రమే వీరులకు ఉత్సవాలు జరపడం విశేషం

● ముస్తాబైన ఆలయాలు

వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారి ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మనాయుడి మేడ, కన్నమదాసు మేడ, వీరుల దేవాలయాలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

ఎడ్లబండలాగుడు పోటీలు ప్రారంభం

● ఆరుపళ్ల విభాగంలో పల్నాడు జిల్లాకు ప్రథమస్థానం

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్లబండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తొలిరోజు ఆరుపళ్ల విభాగంలో పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 14 ఎడ్లజతలు పాల్గొనగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత నిర్ణీత వ్యవధిలో 3,538 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుడిబండి మాధవరెడ్డి ఎడ్లజత 3,260 అడుగులతో రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని కావ్యశ్రీ, మధు ఎడ్లజత 3,250 అడుగులతో మూడోస్థానం, బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం జెపంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 3,121 అడుగులతో నాలుగోస్థానం, తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన ఆషేష్ సుమన్‌రెడ్డి ఎడ్లజత 3 వేల అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు



ప్రథమస్థానం సాధించిన పల్నాడు జిల్లా ఎడ్లజత

చెందిన దేవరపల్లి భార్గవ్‌రెడ్డి ఎడ్లజత 2,983 అడుగులతో ఆరోస్థానం దక్కించుకుంది. సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, గ్రామ పెద్ద కాపు బొమ్మిన శ్రీనివాసరావు, రైతు సంఘం నేతలు సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, పలిశెట్టి శ్రీనివాసరావు, చింతపల్లి రామ్మూర్తి, జక్కా నరసింహారావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, తోట నరసింహారావు, బొల్నేడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే.. సుఖీభవ

(5వ పేజీ తరువాయి)

చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న గందరగోళం

లబ్ధిదారుల సంఖ్యలో తొలి దశలో ఉన్న గందరగోళమే ఇప్పటికీ కొనసాగుతోంది. అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు మధ్య భారీ సంఖ్యలో వ్యత్యాసం ఉంది. వెబ్‌ల్యాండ్ వంటి సాంకేతిక చిక్కులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పీఎం కిసాన్ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని గతంలో యంత్రాంగం చెప్పింది. 2019 నుంచి ఉన్న వెబ్ ల్యాండ్ డేటానే కేంద్రం ప్రామాణికంగా తీసుకుంటుందని, అందువల్లే లబ్ధిదారుల సంఖ్యలో తేడా ఉందని అధికారులు చెప్తున్నారు. రెండో దశ నిధులు విడుదల నాటికీ ఈ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో తెలిపారు. కానీ తొలి దశలోని లబ్ధిదారుల సంఖ్యనే ఇప్పుడు కూడా వ్యవసాయశాఖ చూపిస్తోంది. తొలి దశ రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాక, అర్హత కలిగిన ఎవరికైనా సుఖీభవ నిధులు పడకపోతే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దాని ఆధారంగా పలువురు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వారి అర్హతను నిర్ధారించారు. అయితే తాజా లబ్ధిదారుల్లో వారి పేర్లు కనిపించడంలేదు. అభ్యంతరాల ద్వారా అప్పుడు అర్హులుగా తేలిన వారు, మలి విడతలో ఎందుకు అనర్హులయ్యారనేదానికి వ్యవసాయశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కౌలు రైతుల జాబితాలు ఇంకా సిద్ధం కానట్లు తెలుస్తోంది. కౌలు రైతులకు ఒకేసారి రూ.14 వేలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రెండో విడతలో కౌలు రైతులకు సుఖీభవ అందుతుందా లేదా అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ సారి లేకుంటే మూడో విడతలో వారికి సుఖీభవ అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

140 మీటర్లా.. 250 మీటర్లా?

(5వ పేజీ తరువాయి)

చర్చించి 140 మీటర్ల వెడల్పునకు ఆమోదం పొందారు. కాగా ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏకంగా 250 మీటర్ల వెడల్పుతో తుది డీపీఆర్‌ని సిద్ధం చేసి కేంద్రం నుంచి ఆమోదం తీసుకుని గుంటూరు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి నివేదించారు. దీని వల్ల భూసేకరణ ఖర్చులు పెరిగిపోతాయి. పైగా భూమినే నమ్ముకుని తరతరాలుగా జీవిస్తోన్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అలానే పరిశ్రమలు, వాటర్ బాడీస్‌కి కూడా నష్టం జరగొచ్చు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌పై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. 140 మీటర్ల వెడల్పులోనే మీడియన్‌తో ఆరు వరుసల రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లు, రైలుమార్గానికి సరిపోతుంది. అలాంటిది దీని కంటే 110 మీటర్లు అదనంగా భూసేకరణ చేయాలని ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు తమతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరుతున్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

దిగువకు 725 క్యూసెక్కుల నీటి విడుదల



దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను తగ్గించడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 9,618 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 725 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,154 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 585.80 అడుగులు ఉంది. ఇది 299.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,097 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,462 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 35,159 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 35,159 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.02 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల 400 క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సామాన్య భక్తులకు వైకుంఠ దర్శనం హర్షణీయం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులు పాటు కల్పిస్తూ టీటీడీ ప్రకటించడం హర్షణీయమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డిసెంబరు 30వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు భక్తులకు ఈ ప్రత్యేక దర్శన అవకాశం ఉంటుందని చెప్పారు. పది రోజుల కాలంలో 182 గంటలు దర్శన సమయం ఉండగా.. అందులో 104 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయించడం ఆనందకర మన్నారు. వీవీఐపీలకు, విఐపీలకే లభించే వైకుంఠ ద్వార దర్శనాన్ని సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకు కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని జీవీ తెలిపారు.

మక్కా ప్రమాదంపై ఎమ్మెల్యే యరపతినేని సంతాపం



పిడుగురాళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన మక్కాయాత్రలో భాగంగా ఉమ్రాకు వెళ్తున్న 45 మంది హైదరాబాదీయులు బస్సు ప్రమాదంలో సజీవదహనం కావడంపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. ఒక డ్రైవర్ చేసిన తప్పిదానికి ఎంతో మంది మృతి చెందడం మనసును కలిచివేస్తుందని, అంతేకాకుండా హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 18 మంది ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకర ఘటన అని అన్నారు. అక్కడి ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు మరోసారి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు.

విశాఖ ఉక్కు పేరెత్తే అర్హత జగన్‌కు లేదు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంట్ ఆస్తులను, భూములను అమ్మకానికి పెట్టిన జగన్ అండ్ కో, ఇప్పుడు నీతి వాక్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మొత్తం ఉక్కు ఫ్యాక్టరీని గంపగుత్తగా రూ. 500 కోట్లకే పోస్కో సంస్థకు ధారాదత్తం చేయాలని చూసిన వారు ఇప్పుడు మాయ మాటలతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని లేపేసి ఆ ప్రాంతంలో రాజధాని కడతామన్నప్పుడు విశాఖ ఉక్కు సంస్థ పరిరక్షకులు, కార్మిక పక్షపాతులు నోరెత్తలేదేమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని, ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థకు దేశంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడు చేయని సాయం చంద్రబాబు చేశారనే నిజాన్ని గ్రహించాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

వీరుల మహోత్సవాలను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాట అత్యంత వైభవోపేతంగా నిర్వహించే చారిత్రాత్మక ఉత్సవాల్లో ఒకటైన కారంపూడి వీరుల మహోత్సవాలను జయప్రదం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం మాచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు, వీరాచారవంతులు పెద్ద సంఖ్యలో వస్తారన్నారు. ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్నదాత సుఖీభవతో రైతుకు నిజమైన భరోసా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి వంచనలతో మోసపోయిన రైతుకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవతో నిజమైన భరోసా వచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. వైసీపీ రైతు భరోసా పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి హంగామా చేశారని, కానీ వాస్తవానికి అందిన డబ్బులో ఎక్కువ భాగం కేంద్రం ఇచ్చిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం స్వయంగా వైఎస్ఆర్ జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించి, రైతు ఖాతాలలో నిధులు జమ చేస్తారన్నారు. ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ. 2 వేలు, రాష్ట్ర వాటా రూ. 5 వేలు మొత్తం కలిపి రూ. 7 వేలు ప్రభుత్వం జమచేస్తుందన్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీలో క్రికెట్ పోటీలు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ (ఏఎన్‌యూ) ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తేజో మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజో మూర్తి మాట్లాడుతూ, బుధవారం ఫార్మసీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అధికారులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్. మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, పావని, దివ్య భార్గవి, రజిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

గొంతునులిమి భార్యను చంపిన భర్త



లక్ష్మీపార్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో మంగళవారం కట్టుకున్న భార్యను ఆమె భర్త గొంతు నులిమి హత్య చేశాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కిలిమి శంకర్‌రెడ్డి, లక్ష్మీపార్వతి (29)కు ఐదేళ్ల కిందట వివాహమైంది. వారి దాంపత్య జీవితంలో కలహాలు రావడంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపార్వతి మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేస్తూ ఎర్రబాలెం గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం భర్త శంకర్‌రెడ్డి లక్ష్మీపార్వతి నివాసానికి వచ్చి దాడి చేయడంతో బాధితురాలు కేకలు పెడుతూ పక్కింట్లోకి పారిపోయింది. శంకర్‌రెడ్డి ఆమె వెంటపడి లోపల నుంచి తలుపు గడియ పెట్టి గొంతు నులిమి హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ బ్రహ్మం, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు పరారీలో ఉండగా, రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

47,667 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,885 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,667 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,907 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	14000
334	10000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	16000	334	10500	17500
273	----	----	నెంబరు. 5	10000	16500
341	10000	17500	341	10500	18000
4884	----	----	4884	11000	14600
సూపర్ 10	----	----	సూపర్ 10	10500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18200	దేవనూరు డీలక్స్	10500	17500
దేవనూరు డీలక్స్	10500	17000	తాలుకాయలు	5000	9000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ తదితరులు

యాంటీబయోటిక్స్ వినియోగంతో దుష్పరిణామాలు : కలెక్టర్

బాపట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : అవసరం లేని యాంటీబయోటిక్స్ వినియోగం వల్ల దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ అధ్యక్షతన ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఔషధ నిరోధకత పెరుగుతున్న ప్రమాదం గురించి అవగాహన కల్పించటం వారోత్సవాల లక్ష్యమన్నారు. జిల్లాలోని వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ షాపులపై దాడులు

- అధికారులపై వ్యాపారి దౌర్జన్యం
- అడ్డుకున్న సిబ్బందిపై దాడి... ఆపై ఆత్మహత్యాయత్నం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ శానిటరి సిబ్బంది

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకే దుకాణంలో అనేకసార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తూ పట్టుబడటం పరిపాటిగా మారింది. తనిఖీకి వెళ్ళిన అధికారులను బెదిరించటం జరిగింది. వివరాల్లోకి వెళితే... మంగళవారం సాయంత్రం మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, సయ్యద్ నజీర్ సిబ్బందితో కలిసి అంబేద్కర్ సర్కిల్‌లోని దుకాణాలలో ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు ప్రారంభించారు. ఇంతలో జీబీసీ రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ట్రేడర్స్ నుంచి ఓ వ్యక్తి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్‌లు ఒకబస్తా తీసుకురావటాన్ని గమనించారు. షాపు దగ్గరకు శానిటరి సిబ్బంది తనిఖీ నిమిత్తం వెళ్ళగా వారిపై దాడి చేశారు. ఎప్పుడూ మా దుకాణమే కనిపిస్తుందా అన్ని చోట్ల విక్రయిస్తున్నారు తయారు చేసే కంపెనీలను మూసివేయకుండా మామీద పడుతున్నారంటూ పెద్ద ఎత్తున కేకలు పెట్టారు. దుకాణం యజమాని పసుపులేటి శిరీష అధికారుల తీరును తప్పుపడుతూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ట్రాక్టర్ కిందపడుకొని పోనివ్వమని కేకలు పెట్టింది. పోలీసు సిబ్బంది వచ్చి ఆమెను బయటకు తీసి కౌన్సెలింగ్ ఇచ్చారు. చివరకు దుకాణంలో సింగిల్‌యూస్ ప్లాస్టిక్ టన్ను వరకు లభించింది. ఇప్పటికే ఈ దుకాణంలో ఏడుసార్లు ప్లాస్టిక్ విక్రయిస్తూ పట్టుబడ్డారు. పైగా అధికారులపై దాడి చేసి దౌర్జన్యం చేయటంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, సయ్యద్ నజీర్‌లు సిబ్బందితో కలిసి వెళ్ళి ఫిర్యాదు చేశారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వ్యాపారి శిరీష, స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్

ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవం

పిట్టలవానిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖిఅమ్మవారి దేవస్థానంలోని కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవం జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. దేవస్థానానికి అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ వారిచే ప్రకటించబడిన వారి ప్రతినిధులైన ఆలపాటి శివయ్య ద్వారా ఈ సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతులమీదుగా జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, జిల్లా దేవదాయశాఖాధికారి జె.సూర్యప్రకాశరరావు విచ్చేస్తారని దేవస్థానం పాలకమండలి సభ్యుడు కలకోట చక్రధర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి సంయుక్తంగా తెలిపారు.

ముప్పలనేని శేషగిరిరావుకు ఘన నివాళి

బాపట్ల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగానికి విశేష కృషి చేసి విద్యాప్రదాతగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ అధ్యక్షులు ముప్పలనేని శేషగిరిరావు 6వ వర్ధంతిని మంగళవారం జీబీసీరోడ్డులోని ఆయన స్మృతి వనం వద్ద నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు, ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి సేవలను కొనియాడారు. బాపట్లను విద్యారంగంలో నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, యువ నాయకుడు ముప్పలనేని శేషసుమంత్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు మందపాటి ఆంధ్రేయ, సోమయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, సీనియర్ నాయకులు పిండిమర కృష్ణ, అల్లం గోపికృష్ణ, దగ్గుమల్లి కెనడి, మాజీ ఎంపీపీ దాసరి యోహాన్, మాజీ సర్పంచ్‌లు ఇనగంటి గాంధీ, నక్కల వెంకటస్వామి, పీటా వెంకటేశ్వరరావు, మురళి, గంటా రాజబాబు, సలగల సురేష్, గంటా నవీన్, కిషోర్, బుల్లిరెడ్డి, తిమ్మరాజు, వెంకటసుబ్బారావు, పులివాసు పాల్గొన్నారు.



ముప్పలనేని విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, నాయకులు తదితరులు

పౌరులకు సమర్ధవంతమైన సేవలందించాలి : కమిషనర్



పారిశుధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మంగళవారం ఉదయం పర్యటించారు. సాధారణ తనిఖీలలో భాగంగా కర్లపాలెంరోడ్డు, జీబీసీరోడ్డు ప్రాంతాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించిన అంశాలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి ప్రతిరోజు నిర్వహిస్తున్న కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ఆలసత్వం వహించరాదన్నారు. అనంతరం వివేకానందకాలనీలోని మున్సిపల్ పార్క్‌ను పరిశీలించారు. సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. సూర్యలంకరోడ్డులోని అన్న క్యాంటీన్‌లో ఆహారపదార్థాల నాణ్యతను తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ఈ-ప్లెడ్జి కార్యక్రమం

బాపట్ల,నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా డిజేబుల్, ట్రాన్స్‌జెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ-ప్లెడ్జి కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మత్తుపానీయాలకు దూరంగా ఉండి విద్యమీదనే తమ దృష్టిని కేంద్రీకరించి జీవితంలో ఉన్నతశిఖరాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమాదేవి అధ్యక్షత వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్, రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కళాశాల స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ డి.నిరంజన్, సైకాలజిస్ట్ పి.అన్వేష్, ఎస్‌డి మతీన్, ఎస్‌డి నాగూర్‌బాషా, డిఎస్.రజియా, దుర్గా ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం

- కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు నష్టపోకుండా చూడటమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని, ధాన్యానికి మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేపడుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరు రైతు సేవా కేంద్రం-1 వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు దగా పడ్డారని, ధాన్యం కొనుగోలులో ఆ పార్టీ నాయకులే దళారుల అవతారమెత్తి రైతులను నిట్ట నిలువున దోచుకున్నారని, పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులను కూడా అమ్ముకున్నారంటూ ఆరోపించారు. ఆ పరిస్థితి కూటమి ప్రభుత్వంలో రైతులకు రాకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 24 నుంచి 48 గంటల వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా బుధవారం అమలు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని చుండూరులో ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించి రైతు ఖాతాల్లో రాష్ట్రవాటా రూ.5 వేలు, కేంద్ర వాటా రూ.2 వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ భావన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయాలలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇందుకోసం తన చాంబర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జీడీసీఎంఎస్ ఛైర్మన్ హరిబాబు మాట్లాడుతూ, రైతు పండించిన ప్రతి గింజను రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆర బెట్టుకుని కేంద్రాలకు తీసుకు వచ్చి తేమ శాతం పరిశీలించిన అనంతరమే విక్రయాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, సివిల్ సప్లయిస్ డీఎం హరగోపాల్, ఏడీఏ లక్ష్మి, జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ఛైర్మన్ గాంధీ, సెక్రటరీ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, డీసీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, శివారెడ్డి, క్రాప, ఈపూరు పీఏసీఎస్ అధ్యక్షులు కోగంటి హరిబాబు, మేకా దివాకర్, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఏవో బ్రహ్మారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రాయితీపై రైతులకు డ్రోన్ అందించిన ఎమ్మెల్యే ఆనందబాబు

రాయితీపై రైతులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు డ్రోన్ పంపిణీ చేశారు. అనంతరం కొల్లూరుకు చెందిన విఘ్నేశ్వర గ్రూప్‌నకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై డ్రోన్ కొనుగోలు చేశారు. రూ.9,80,000 విలువ కలిగిన డ్రోన్‌ను రూ.7,84,000 రాయితీపై పొందగా ఎమ్మెల్యే ఆనందబాబు, జాయింట్ కలెక్టర్ భావన, జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, రైతులకు అందజేశారు.

పుస్తకాలు చదవటం ఉత్తమ విద్యార్థి లక్షణం

- డాక్టర్ గడ్డం శేఖర్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్‌బాబు

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు కొనుగోలు చేసి చదవటం ఉత్తమ విద్యార్థి లక్షణమని ఆంధ్రప్రదేశ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగ ముఖ్య కార్యనిర్వహణాధి కారి డాక్టర్ గడ్డం శేఖర్‌బాబు అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో గత 8రోజులుగా నిర్వహిస్తున్న దీక్షారంబ్ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి వ్యవసాయ సంబంధిత గ్రంథాలతోపాటు ఇతర పుస్తకాలను చదవటాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్‌లాల్ అహ్మద్ మొహ్మద్, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్‌ఎం.సంధ్య, డాక్టర్ కె.చంద్రశేఖర్, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

పిట్టలవానిపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని ఖాజీపాలెం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సమర్ధవంతమైన ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ రైతులకు ఎరువులు వాడకాన్ని వివరించారు. బాపట్ల డాట్ సెంటర్ కో ఆర్డినేట్ కె.అచ్యుతరాజు మాట్లాడుతూ రైతులు తమ భూములను మట్టి నమూనాలు పరీక్షించుకొని పోషకాల స్థాయి తెలుసుకొని వాటి ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలన్నారు. ఖాజీపాలెం నీటి సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సత్యనారాయణరాజు, వ్యవసాయ విస్తరణాధికారులు కె.ప్రశాంతి, సీహెచ్ సుదర్శనరావు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి డ్వామా అనేక పథకాలు : పీడీ

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ అనేకపథకాలు అమలు చేస్తుందని డ్వామా పీడీ ఎ.విజయలక్ష్మి తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అధికారులకు, రైతులకు ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం సురేష్, ఏపీఎంఐపీ ఇంజనీర్ రవితేజ, ఏపీవో బాబు, దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఏరియా కోఆర్డినేటర్‌లు ఎన్.శ్రీలత, వి.భగవాన్‌దాసు, గిరిజన నాయకులు దేవరకొండ రాము, ఎ.కిరణ్‌కుమార్, చక్రవర్తి, దేవరపల్లి అబ్రహం పాల్గొన్నారు.

ఇజ్రాయేలు చరిత్రపై అవగాహన అవసరం

బాపట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇజ్రాయేలు చరిత్రపై అవగాహన అవసరమని గుంటూరు బేరియన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.మోజెస్ తెలిపారు. పట్టణంలోని విలియంబూత్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ప్రార్ధన మందిరంలో ఇనిఫినిటి బైబిల్ కళాశాల ఆధ్వర్యంలో ఇజ్రాయేలు చరిత్రపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల రిజిస్ట్రార్ జయబాబు, బోధకులు ఇమానీయేలు, కిరణ్, శరత్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

బాపట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం విద్యాసంస్థల సంస్థల 100మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాలు, బడ్డీకొట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందన్నారు.

విద్యావనరులు సక్రమంగా వినియోగించుకోవాలి

- యువశాస్త్రవేత్త మహ్మద్ ముజురుద్దీన్‌బేగ్

కర్లపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : చదువుతున్న ప్రతి విద్యార్థి తమ ప్రాంత పరిధిలో ఉన్న విద్యావనరులను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని యువ శాస్త్రవేత్త మహ్మద్ ముజురుద్దీన్‌బేగ్ అన్నారు. పట్టుపురుగు పరిశోధనలో నూతన అవిష్కరణలకు శ్రీకారం చుట్టినందుకు జపాన్ దేశం యువ శాస్త్రవేత్తగా అవార్డు ప్రదానం చేసినందుకు హైవెండ్ హైస్కూల్ ఆధ్వర్యంలో మహ్మద్ ముజురుద్దీన్‌బేగ్‌ను మంగళవారం ఎండీ సాయిమహేంద్ర బాబు పూలబొకె అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండి మొహిద్దీన్‌బేగ్, ఛైర్మన్ పెదమల్లు ఉదయచంద్రరావు, ఉపాధ్యాయులు రఫి, షర్మిలబేగం, రాజ్యలక్ష్మి, షబీన, పరీదా, హిమబిందు, జరీనా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి అవినీతిపై విచారణ జరిపించాలి

బాపట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామపంచాయతీ కార్యదర్శి కె.సాంబశివరావుపై వస్తున్న అవినీతి, ఆలసత్వం, సర్పంచ్‌పై వేధింపులకు సంబంధించి విచారణ జరిపించాలని గ్రామానికి చెందిన మూల్పూరు మాణిక్యారావు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామసర్పంచ్‌ని వేధిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని, దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

కర్లపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. అతడిని చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారని, గుర్తించిన వారు కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర 9440900870 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక దీపార్చన



శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో వెలిగించిన కార్తిక దీపాలు

బాపట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : త్రయోదశి తిథిరోజు జరుపుకునే మాసశివరాత్రి సందర్భంగా బాపట్లలోని శివాలయాలలో మంగళవారం రాత్రి కార్తీక దీపార్చన అత్యంత వైభవంగా జరిపారు. ఎస్ఎన్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీగంగా పర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు పూలతో వివిధ ఆకారాలుగా అలంకరించి దీపాలు వెలిగించి పూజలు చేశారు. చీలురోడ్డు సెంటర్‌లోని శ్రీపాండురంగస్వామి దేవాలయం, పట్టణంలోని శ్రీగంగాపార్వతిసమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయాలలో కూడా మాసశివరాత్రి పూజలు విశేషంగా జరిపారు.

● కర్లపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామంలో ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాస శివరాత్రి సందర్భంగా గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు విశేష పూజలు నిర్వహించి అనంతరం 11 కేజిల కర్పూరంతో కార్తిక జ్యోతులు వెలిగించారు. ఈసందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇక్కుర్తి వెంకటాద్రి నాయుడు, కాపుసంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, పుప్పాల సాంబయ్య, బీసా బత్తిన సత్యనారాయణ, ఆలయ మేనేజర్ పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోలాయపాలెం గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామికి కార్తిక మాసంలో మంగళవారం మాసశివరాత్రి పురస్కరించుకొని విశేష అర్చన కైంకర్యాలు, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం లక్ష దీపార్చన, కర్పూర హారతి పూజలు జరిగాయి.

● అమృతలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరులోని శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ప్రదోష కాల ఏకకాలంలో అమృతేశ్వరస్వామికి, నందీశ్వరునికి అభిషేకాలు నిర్వ హించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయంలో 18వ ఏట ఈ పూజా కార్యక్రమాలు జరిపారు. స్వామి వారికి, నందీశ్వరునికి ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. ఎన్నారై పరుచూరి సీతారామాంజనేయులు, మీనాక్షిదేవి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఆలయ అర్చకులు నాగలింగం రామకృష్ణ జరిపారు. అనంతరం 18 కిలోల కర్పూర హారతిని వెలిగించారు.

● వేమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చరిత్ర ప్రసిద్ధి చెందిన జంపని రామేశ్వరాలయంలో మంగళవారం మహానందీశ్వరునికి తెల్లవారుజామున పాలాభిషేకం నిర్వహించారు. అర్చకులు పండిత బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి సుబ్బరాయశర్మ ఆగమ శస్త్ర బద్ధంగా కార్యక్రమం నిర్వహించారు.

● చుండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చినపరిమిలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం, మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి 111 కిలోల అన్నాభిషేకం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళా భక్తులు స్వామి వారికి అభిషేకం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● కొల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస శివరాత్రిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక గంగాపార్వతి సమేత అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు రుద్రహోమం చేశారు.

నేడు సామూహిక కుంకుమార్చన

అమృతలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సామూహిక కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తిరుమల, తిరుపతి దేవస్థానాలు, దాస సాహిత్య ప్రాజెక్టు అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వేమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేమూరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం గ్రంథాలయ అధికారి కంచర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

● నగరం : వ్యాసరచనపోటీలతో విద్యార్థినీ, విద్యార్థుల్లో ప్రతిభ బయటపడుతుందని మంత్రిపాలెం గ్రంథాలయం అధికారి జొన్న బ్రహ్మేంద్ర అన్నారు. విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంతేటి చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కొల్లూరు, అనంతవరం, భట్టిప్రోలు శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొల్లూరులో పంచాయతీ కార్యదర్శి శంకరరావు, అనంతవరంలో శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి కార్తీక్, సాంబశివరావులు భట్టిప్రోలులో ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు రబియా ఆఫ్రిద్ పోటీలకు హాజరై న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు వై.రాంబాబు, జి.కనకదుర్గ, కె.సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

● కర్లపాలెం : కర్లపాలెం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు లెమన్‌స్పూన్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారని గ్రంథాలయాధికారి టీపీ రమణమ్మ తెలిపారు.

● పిట్టలవానిపాలెం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, రన్నింగ్, పద్యాలు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు కమిటీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాసనాయక్, పీడీ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మండలంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కొడాలి మస్తాన్‌రావు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఫిన్‌లాండ్ విద్యా విధానాలు భేష్

- శ్రీరామా సైనిక్ స్కూల్ డైరెక్టర్ తులసివిష్ణు ప్రసాద్



ఫిన్‌లాండ్ రాయబారితో తులసీ విష్ణు ప్రసాద్

కొల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఫిన్‌లాండ్ విద్యా విధానాలు ఎంతో ప్రశంసించబడటంతో పాటు విస్తృతంగా ఆమోదించబడినట్లు శ్రీరామా సైనిక్ స్కూల్ డైరెక్టర్ కొలసాని తులసివిష్ణు ప్రసాద్ మంగళవారం అన్నారు. వినూత్న విద్యా కార్యక్రమాల అన్వేషణలో కీలకమైన ఫిన్‌లాండ్ దేశ రాయబారులతో ఆయన ఇటీవల దుబాయ్‌లో తులా యర్హోలాతోనూ, న్యూఢిల్లీలోని ఫిన్‌లాండ్ రాయబారి కిమ్మోలహ్దేవిర్తాలతో సమావేశం నిర్వహించారు. ఫిన్‌లాండ్ దేశంలో అనుసరిస్తున్న విద్యా విధానాలను భారతీయ పాఠశాలల్లో చేర్చడం గురించి వారితో విస్తృతంగా చర్చించారు. మేధావులతో ప్రశంసించబడిన ఫిన్నిష్ విద్యా పద్దతులను భారతదేశ విద్యా వ్యవస్థలో చేర్చడం ద్వారా ఎన్నో మార్పులు తీసుకురావడమే ఈ సమావేశం ముఖ్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సహకారం భారతదేశ విద్యారంగంలో ఉత్తేజకరమైన పరిణామాలకు దారి తీస్తుందనే ఆశాభావాన్ని తులసీ విష్ణుప్రసాద్ వ్యక్తపరిచారు.

ప్రజారోగ్య సిబ్బంది కార్తిక వనసమారాధన

రేపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది మంగళవారం కార్తిక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి వనసమారాధనల వలన ఐక్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, మున్సిపల్ ఛైర్మన్ కటా మంగ, రేపల్లె మున్సిపల్ వైస్ ఛైర్మన్ తూనుగుంట్ల విశ్వనాథగుప్తా, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ బద్దెల శామ్యూల్, జిల్లా సెక్రెటరీ ఎస్‌కే కరీముల్లా, రేపల్లె సీపీఐ పట్టణ సీనియర్ నాయకులు కన్నెగంటి రమేష్, ఏఐటీ యూసీ ప్రతినిధులు సింగం వాణిశ్రీ, కోన శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ మధుసూదనరావు, ఏఈ సామ్యూల్ జాన్, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు, రేపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ శిరంశెట్టి శ్రీనివాసరావు, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజారోగ్య సిబ్బంది వనసమారాధనలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

కార్మిక శాఖ జారీ చేసే ఈశ్రమ్ కార్డులను పొందాలి

- డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు

వేమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలు ప్రతి ఒక్కరూ జాబ్‌కార్డుతో పాటు కార్మిక శాఖ జారీ చేసే ఈశ్రమ్ కార్డులను కూడా తప్పనిసరిగా పొందాలని డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి చేపట్టాల్సిన పనులు గుర్తింపు తీర్మానంగా చావలి, పెనుమర్రు, వెల్లబాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఏపీవో సత్యకృష్ణ పర్యవేక్షణలో జరిగిన సభలలో పాల్గొని డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ, పని పథకానికి గుర్తింపుగా ప్రభుత్వం జారీ చేసే జాబ్‌కార్డుల నిమిత్తంగా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సభలలో చావలి సర్పంచ్ విష్ణు మొలకల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పెనుమర్రులో టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, కార్యదర్శి సింధూజ, వెల్లబాడులో సర్పంచ్ బుల్లియ్య, సుజాత, ఇతర సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల

చెరుకుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చేతుల మీదగా చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం మధ్యాహ్నం జరుగుతుందని, మండలంలోని రైతులందరూ హాజరు కావాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ ఒక ప్రకటనలో కోరారు.

హైందవ ధర్మం కోసం ప్రాణ త్యాగం చేసిన లక్ష్మణానంద సరస్వతి

చెరుకుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైందవ ధర్మం కోసం లక్ష్మణానంద సరస్వతి ప్రాణ త్యాగం చేశారని జిల్లా దేవాలయ ప్రముఖ మండల కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కుంచలవారిపాలెంలో శ్రీ లక్ష్మణానంద సరస్వతి బలిదానోత్సవంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వామిని స్మరించుకుంటూ ప్రతి గ్రామ దేవాలయాలు కేంద్రంగా ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, తుమ్మ జోగేశ్వరరావు, రెడ్డి పిట్టు నాగేంద్రమ్మ, కుంచెల ఏడుకొండల రెడ్డి, లంక హరి ప్రసాదరెడ్డి, పిట్టు హేమంత్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు మద్దతు ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాలి

నగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే ప్రతి రైతు ధాన్యాన్ని అమ్ముకోవాలని నగరం మండల వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు అన్నారు. ధూళిపూడిలోని రైతుసేవా కేంద్రంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, కె.వంశీకృష్ణ, గ్రామ సహాయకురాలు బి.స్వాగతలక్ష్మి, సహాయకులు నాగ రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంపై శిక్షణ తరగతులు

భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ గ్రామాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి ప్రారంభించారు. భట్టిప్రోలు మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఈసీ సభ్యులు 40 మందిని నాలుగు టీమ్‌లుగా విభజించారు. ఆదర్శ గ్రామాలకు ఉండాల్సిన లక్షణాలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం శ్రీమన్నారాయణ సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి కట్టా జ్యోతి, సీసీలు నరేంద్ర, మనోజ్, రజనీకుమారి, యానిమేటర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

చెరుకుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు బుధవారం చెరుకుపల్లి శివాలయం దగ్గర గల శ్రీరామశాస్త్రి కల్యాణ మండపంలో జరుగుతుందని ఏడీఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ (ఫార్మర్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి) ఫోరం సభ్యులు, సూపరింటెండెంట్ ఇంజనీర్ (బాపట్ల) ఎ.ఆంజనేయులు, బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ.భాస్కర్ రావు హాజరవుతారన్నారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెరుకుపల్లి మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.